హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	235	267
సూర్యాపేట	రూ.165	240	270
నల్లగొండ	రూ.158	236	278

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.5 । కనిష్ఠం 24.0

- భువనగిరి పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో ప్రశాంతంగా పోలింగ్
- సాయంత్రం ఐదు గంటల వరకు 72.34 శాతం
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు.. సరిచేసిన ఎన్నికల సిబ్బంది
- పల్లెలకు తరలిన జనం



భువనగిరిలో ఓటు వేసేందుకు క్యూలైన్లలో నిల్చున్న ఓటర్లు

భువనగిరిలో ఓటు వేసిన మహిళ

పోలింగ్ ప్రశాంతం

భువనగిరి మండలంలో ఓటేసి సిరా చూపుతున్న వృద్ధులు

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నాలుగో విడత ఎన్నికల పోలింగ్ సోమవారం ఉమ్మడి జిల్లాలోని భువనగిరి, నల్లగొండ పార్లమెంట్ స్థానాల్లో సందడిగా కొనసాగింది. ఉదయం ఆరు నుంచే మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాల బాటపట్టారు. గంట గంటకూ పోలింగ్ శాతం పెరుగుతూ సాయంత్రానికి దాదా పు పూర్తయింది. అక్కడక్కడ ఈవీఎంలు మొరాయిం చినా, కాస్త ఆలస్యంగానైనా పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం పొద్దుపోయాక ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎండల్లోనూ ఓటర్లు కేంద్రాలకు తరలిరావడం కనిపించింది. యువత ఈసారి ఓటేసేందుకు ఆసక్తి చూపారు. పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలించారు.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా సాగాయి. ఎన్నికల సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గంలో 2,141 పోలింగ్ కేంద్రాలున్నాయి. 618 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాచకొండ పోలీస్ కమిషనరేట్, జనగామ పరిధిలోని పోలీసులు కట్టుదిట్ట భద్రతను ఏర్పాటుచేశారు. భువనగిరి మండలం గౌస్‌నగర్‌లో, మోత్కురు మండలం అనాజ్‌పూర్, చౌటుప్పల్ మండలంలోని లింగోజిగూడ, వలిగొండ మండలంలోని 255 పోలింగ్ బూత్‌లో, ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించాయి. దీంతో వెంటనే అధికారులు వేరే ఈవీఎంలను ఏర్పాటుచేశారు. దీంతో కొంతసేపు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఆత్మకూరు(ఎం) మండలం కప్రాయపల్లి పోలింగ్‌కేంద్రంలో చివరిదశలో ఇద్దరు ఓటర్లు ఉండగా మొరాయించాయి. పోలింగ్ సరళిని పరిశీలిస్తే మందకొడి గా కొనసాగింది. ఉదయం 9గంటల వరకు 10.54శాతం పో లింగ్ కాగా 11 గంటల్లోపు 27.97శాతం, ఒంటిగంట వరకు 46. 49శాతం, మూడు గంటలవరకు 62.05శాతం, సాయంత్రం ఐదు గంటల్లోపు 72.34శాతం ఓటింగ్ నమోదైంది.

పోలింగ్ కేంద్రాలకు ఉదయమే చేరుకున్న మహిళలు

ఉదయం 7నుంచి 9గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో అత్యధిక శాతం మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 11 గంటల సమయం దాటిన తర్వాత కాస్త పుంజుకుంది. నియోజకవర్గంలో వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలకోసం ఎన్నికల సంఘం రవాణా సౌకర్యం ఏర్పాటు చేయడంతో చాలామంది మంది ఓటేశారు. ఈ ఎన్నికల్లో యువ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో యువ ఓటర్లు కనిపించారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలోపు ఎవ్వరినీ అనుమతించలేదు. ఓటర్ స్లిప్పులు, గుర్తింపుకార్డులు ఉంటేనే పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల అబ్జర్వర్లు, భువనగిరి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు.

స్ట్రాంగ్ రూంకు తరలిన ఈవీఎంలు

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 2,141 పోలింగ్‌కేంద్రాల్లోని ఈవీఎంలను పట్టణంలోని ఆరోరా కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. ని యోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున స్ట్రాంగ్‌రూంలను ఏర్పాటుచేశారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎన్నికల సిబ్బంది సామగ్రిని చేరవేశారు. పలుచోట్ల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కూడా ఈవీఎంలను తరలించారు. ఎన్నికల అబ్జర్వర్ రాబర్ట్‌సింగ్, భువనగిరి ఆర్వో హనుమంతు కే.జెండగే, రాచకొండ పోలీస్ కమిషర్ తరుణ్‌జోషి, భువనగిరి జోన్ డీసీపీ రాజేష్‌చంద్ర ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలింపుపై పర్యవేక్షించారు.

2019 లోక్‌సభ ఎన్నికల్లో 74.42 శాతం పోలింగ్

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
1 ఇబ్రహీంపట్నం	276549	185053	66.92
2.మునుగోడు	230161	179605	78.03
3.భువనగిరి	202028	165297	81.82
4.నకిరేకల్	236221	179412	75.95
5.తుంగతుర్తి	239558	173015	72.22
6.ఆలేరు	218123	153499	80.40
7.జనగామ	224887	153499	68.29
మొత్తం	16,27,527	12,11,256	74.42

పల్లెలకు తరలిన జనం

ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు పలు గ్రామాల నుంచి వచ్చి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న ప్రజలు పల్లెలకు తరలివెళ్లారు. భువనగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ఓటర్లు ఉద యం ఏడుగంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు బస్సుల్లో, సొంత వాహనాల్లో తరలివెళ్లారు. అన్నిపార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమకు సంబంధించిన ఓటర్లను పిలుపించుకుని ఓట్లను వేయించుకున్నారు. పలు జిల్లాల నుంచి వచ్చేసి, నగరశివారుప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు ఆయా గ్రామాలకు ఓట్లు వేసేందుకు తరలివెళ్లారు. సుదూరప్రాంతాల నుంచి వచ్చేసే ఓటర్లకోసం నేతలు గ్రామాల్లో భోజనాలు కూడా ఏర్పాటు చేశారు.





నల్లగొండ, కోదాడలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది

పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి



భువనగిరి రాయిగిరిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి

భువనగిరి టౌన్, మే 13: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 18వ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా కొనసాగిందని కమిషనర్ తరుణ్ జోషి తెలిపారు. సోమవారం భువనగిరి రాయిగిరిలోని పోలింగ్ బూత్‌లను ఆయన తనిఖీ చేసి, పోలింగ్ సరళిని పరిశీలించి మాట్లాడారు. ప్రశాంత పోలింగ్‌కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు పోలీసులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు పోలీస్ శాఖ తనవంతు ప్రయత్నాలను చేసిందని చెప్పారు. పోలింగ్ విజయవంతం చేసినందుకు, ప్రశాంతంగా సాగేందుకు సహకరించిన ఓటర్లకు, పోలీసు బలగాలకు ఆయన అభినందనలు తెలిపారు. ముందుగా జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో పోలింగ్ సరళిపై సమీక్షించి వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర, తదితర అధికారులు కమిషనర్ వెంట ఉన్నారు.

వలిగొండ: ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతుందని రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి తెలిపారు. మండల కేంద్రంలో శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టేకులసోమారం పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ వాతావరణం అనుకూలించడం వల్ల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు అని అన్నారు. ఆయన వెంట చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐ మహేందర్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండల పరిధిలోని తూప్రాన్‌పేట, దండుమల్కాపురం, తంగడపల్లిలోని పోలింగ్ కేంద్రాలను రాచకొండ పోలీస్ కమిషనరేట్ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. సీపీ వెంట ఐపీఎస్ అధికారి సంగ్రామ్‌సింగ్, లక్ష్మీనారాయణ, సీఐ ఆశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

- ఆరబెట్టుకుంటున్న రైతులు
- పాక్షికంగా తడిసిన 2,500 బస్తాలు



చౌటుప్పల్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు

చౌటుప్పల్ టౌన్, మే 13: చౌటుప్పల్ పట్టణంలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం రాశుల కిందకు నీరు చేరింది. కాంటాలు వేసిన 2,500 ధాన్యం బస్తాలు పాక్షికంగా తడిసిపోయాయి. యార్డులో వందకు పైగా ధాన్యం రాశులు ఉన్నాయి. సీసీ కళ్లంపై పోసిన ధాన్యం రాశుల కిందకు మాత్రమే నీరు చేరింది. ఆకాశం మేఘావృతమవుతుండడంతో ధాన్యం రాశులను ఆరబెట్టేందుకు రైతులు ముందుకు రాలేదు. ఒకరిద్దరు రైతులు మాత్రమే ధాన్యం రాశులను ఆరబెట్టడం కనిపించింది. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఉండడంతో గ్రామాల నుంచి రైతులు కూడా మార్కెట్ యార్డుకు రాలేకపోయారు. అందులోనూ సోమవారం ఎన్నికల సెలవు ఉండడంతో ధాన్యం తూకాలు వేయలేదు. మంగళవారం నుంచి తూకాలు ప్రారంభం కానున్నాయని పీఏసీఎస్ సెక్రటరీ వై.రమేష్ తెలిపారు. కాగా, మార్కెట్ యార్డులో గత నెల రోజుల్లో 150 మంది రైతుల నుంచి 15వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కాంటాలు వేశారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

- భూదాన్‌పోచంపల్లి కనుముకులలో రైతుల ధర్నా



కనుముకులలో ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి, మే 13: అకాల వర్షానికి తడిసిన ధాన్యం ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల గ్రామంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులు ధర్నాకు దిగారు. ఆదివారం రాత్రి కురిసిన అకాల భారీ వర్షానికి ఆయా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. కనుముకుల కేంద్రంలోని 250 బస్తాల ధాన్యం తడిసిపోవడంతో రైతులు నిరసన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరిస్తూ ధర్నా నిర్వహించారు. సుమారు గంటన్నర సేపు ధర్నా చేయటంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి వచ్చి వారితో మాట్లాడారు. లారీ డ్రైవర్స్ యూనియన్ సమ్మెలో ఉండడంతో లారీలు రావడంలేదని, అయినప్పటికీ తన వంతుగా ప్రత్యామ్నాయంగా నాలుగు లారీలతో ధాన్యం లిఫ్ట్ చేయిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా, ఎస్‌ఐ బాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని చేరుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

మామిడీలా

మామిడి రైతులకు రూ.100కోట్లు నష్టం

- అకాల వర్షంతో నష్టాల్లో మామిడి రైతులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 14వేల ఎకరాల్లో మామిడి సాగు
- అకాల వర్షం, ఈదురు గాలులతో 10వేల ఎకరాల్లో పంట నష్టం
- కిలో రూ.45నుంచి రూ.10కి తగ్గిన ధర

ఆరుగాలం కష్టం ప్రకృతి ప్రకోపానికి ఆవిరై పోతోంది. ఏడాదంతా కాపాడుకున్న పంటను రెండుమూడు రోజులు కురిసే అకాల వర్షాలు దెబ్బతీస్తున్నాయి. అకాల వర్షాలకు తోడు ఈదురుగాలుల బీభత్సంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. హోల్‌సేల్‌గా రూ.45కు కిలో చొప్పున విక్రయించాల్సిన కాయలను రూ.10కే విక్రయించి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. లాభాల మాటేమోగాని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేదిలేదని, చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కోదాడ



తోటలో రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు



తోటలో రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు

చేతికొచ్చిన పంట. మంచి గిట్టుబాటు ధర. ఈ ఏడాది పర్వాలేదు, లాభం వస్తుందనుకున్న రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. లాభం సంగతి దేవుడెరుగు పెట్టిన పెట్టుబడి చేతికొస్తుందో, లేదోనని భయం వెంటాడుతోంది. ఇప్పటికే డిసెంబరు, జనవరి నెలల్లో కురిసిన మంచుతో పూత నిలవకపోవటం, కాయాల్సిన పంట కాయకపోవటంతో రైతన్న ఆందోళనగా ఉన్నాడు. ఈ క్రమంలో అంతో ఇంతో కాసిన కాయలతో ఎంతో కొంత ఫలసాయం వస్తుందనుకున్న సమయంలో ఈదురుగాలులు, అకాలవర్షంతో చేతికొచ్చిన పంట నేలపాలు కావటంతో ఉమ్మడి జిల్లా రైతులు లబోదిబోమంటున్నారు. ఈదురుగాలులు, వర్షంతో 80శాతం కాయలు నేలపాలైనట్లు అంచనా వేస్తున్నారు. దీంతో నిన్నటి దాక హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో ధర రూ.45 పలుకగా, నేలపాలైన కాయ ధర రూ.10కి తగ్గిందని వాపోతున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడి వస్తుందో? రాదోనని? ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర తగ్గటంతో టన్నుకు రూ.35వేల చొప్పున, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రైతులకు సుమారు రూ.100,05,00,000 నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈదురు గాలులు ఇలానే కొనసాగితే నష్టం మరింత పెరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. కాగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎకరాకు రూ.35వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 14 వేల ఎకరాల్లో మామిడి సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. గత మూడు రోజులుగా ఈదురుగాలులకు, వర్షంతో సుమారు 10వేల ఎకరాల్లో పంట నష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.100 కోట్ల నష్టం

అకాల వర్షం.. తగ్గిన ధరతో ఉమ్మడి జిల్లాలోని రైతులకు రూ.100,05,00,000 నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఒక ఎకరాలో 30 చెట్లు సాగు చేసినట్లు రైతులు చెబుతున్నారు. 15 సంవత్సరాల వయస్సు తోటలో చెట్ల పాదులు తీసేందుకు, దుక్కి, మందు, కోత కూలి, కౌలు కింద రూ.లక్ష వరకు ఖర్చు వస్తుంది. అంతా సక్రమంగా ఉంటే ఎకరాకు నాలుగు టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు రూ.45వేల ధర వస్తే, ఎకరాకు రూ.1.80లక్షలు వస్తుంది. ఖర్చు రూ.లక్ష పోను ఎకరాకు రూ.80వేల లాభం వస్తుంది. కాగా అకాల వర్షంతో మూడు టన్నుల మేర కాయలు కింద పడినట్లు రైతులు పేర్కొంటున్నారు. దీంతో కింద పడిన కాయలను మార్కెట్‌కు తీసుకెళితే టన్ను కాయకు రూ.10వేలు వచ్చినట్లు పేర్కొంటున్నారు. దీంతో టన్నుకు రూ.45వేల చొప్పున మూడు టన్నులకు రూ.1.35లక్షలు రావాల్సి ఉండగా, రూ.30వేలు మాత్రమే వచ్చాయని చెబుతున్నారు. మిగతా టన్నుకు ఎంతో వస్తుందో చెప్పలేని దుస్థితి. దీంతో రైతులు అకాలవర్షంతో తీవ్రనష్టం చవిచూడాల్సి వచ్చిందని వాపోతున్నారు. ప్రభుత్వం రైతులు, కౌలు రైతుల మేలును దృష్టిలో ఉంచుకొని, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

పెట్టుబడి వస్తుందో.. లేదో..



వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవటంతో డిసెంబరు, జనవరి నెలల్లో పూతను, కాసిన కాయలను నిలబెట్టేందుకు పెద్దమొత్తంలో మందులు వాడాల్సి వచ్చింది. అధిక మొత్తంలో మందులను వాడినా అనుకున్న మేర పూత నిలబడలేదు. దీంతో దిగుబడి ఎకరాకు 6నుంచి ఎనిమిది టన్నులు రావాలి. కానీ నాలుగు టన్నులకు మించి రాలేదు. దీనికితోడు అకాల వర్షం, కాయలు కిందపడటం, వ్యాపారులు ధర తగ్గించటంతో పెట్టబడి, కౌలు వచ్చే పరిస్థితి లేదు. ఏమి చేయాలో పాలుపోవటం లేదు. ఆరుగాలం ఇంట్లో అందరం కష్టపడినా, పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి కోపానికి బలికావాల్సి వస్తుంది. కౌలు ఎలా చెల్లించాలో? తెలియని అయోమయ పరిస్థితి. ప్రభుత్వమే చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలి.

- షేక్ ఖాజా, కౌలు రైతు, కోదాడ

పట్నం వైపు పరుగులు



చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ

తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నవారు హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతున్నారు. స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత తిరిగి సోమవారం సాయంత్రం నుంచి హైదరాబాద్ బాట పట్టారు. దీంతో పెద్దసంఖ్యలో వాహనాలతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి రద్దీగా మారింది.

- చౌటుప్పల్ రూరల్, చౌటుప్పల్ టౌన్

6

హరిహరులకు శాస్త్రోక్త పూజలు



యాదగిరికొండపై శివలింగానికి అభిషేక పూజలు చేస్తున్న అర్చకుడు

పట్నం వైపు పరుగులు

● హైదరాబాద్‌కు తిరుగు పయనమైన ఓటర్లు ● జాతీయ రహదారిపై వాహనాల రద్దీ



చౌటుప్పల్ పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల్ రూరల్, చౌటుప్పల్ టౌన్, మే 13: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నవారు హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతున్నారు. స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు ఓటు హక్కు వినియోగించుకున్న తర్వాత తిరిగి సోమవారం సాయంత్రం నుంచి హైదరాబాద్ బాట పట్టారు. దీంతో పెద్దసంఖ్యలో వాహనాలతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి రద్దీగా మారింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద అర కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచి గేటు దాటడానికి 15 నిమిషాల సమయం పట్టింది. 16 గేట్లకు గాను 10గేట్ల ద్వారా హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలను పంపుతున్నారు. సాధారణ రోజుల్లో నిత్యం 30 నుంచి 35 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సోమవారం తిరుగు పయనంలో 45 వేల వాహనాలు హైదరాబాద్ వైపునకు వెళ్లినట్లు టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. అర్ధరాత్రి వరకు వాహనాల రద్దీ కొనసాగింది. పెద్దసంఖ్యలో వాహనాలు వస్తుండడంతో రోడ్డు పక్కన ఉన్న హోటళ్లు వాహనాలతో కిటకిటలాడాయి. బస్సుల కోసం ప్రజలు బస్టాప్‌ల వద్ద గంటల తరబడి ఎదురు చూశారు. చౌటుప్పల్ మండలంలోని జాతీయ రహదారి సోమవారం మధ్యాహ్నం తర్వాత ఊపిరి పీల్చుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే జాతీయ రహదారిపై ఏపీ ఓటర్ల వాహనాల రద్దీ నాలుగు రోజుల పాటు కొనసాగింది. అయితే సోమవారం ఉదయం జాతీయ రహదారి కొన్ని గంటల పాటు నిర్మానుష్యంగా కన్పించినా ఓట్లు వేసిన ఏపీ ప్రజలు సాయంత్రం హైదరాబాద్‌కు తిరుగు పయనం కావడంతో రహదారిపై మళ్లీ వాహనాల రద్దీ పెరిగింది.



చౌటుప్పల్ పట్టణం నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న వాహనాలు

భువనగిరి సిగలో.. వికసించిన పద్మాలు

▸ ఈ ఏడాది కేతావత్ సోమ్‌లాల్‌నాయక్, కూరెళ్ల విఠలాచార్య, స్తపతి ఆనందాచారి వేలుకు పద్మశ్రీ అవార్డులు ▸ సామాజిక సేవలో రావి నారాయణరెడ్డికి గతంలో పద్మ విభూషణ్ అవార్డు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏటా ప్రకటించే భారతదేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో పద్మశ్రీ అవార్డు ఒకటి. ఈ అవార్డులు మూడు విభాగాల్లో ఇస్తారు. పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులు ఇస్తారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు ఈ సంవత్సరం మూడు పద్మశ్రీ అవార్డులు దక్కాయి. స్వతంత్ర సేనాని భువనగిరి మండలం బొల్లేపల్లిలో భూస్వామ్య కుటుంబంలో జన్మించిన రావి నారాయణరెడ్డికి మరణానంతరం 1992లో భారత ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డు ప్రకటించింది. భువనగిరి మండలం ఆకుతోటబావితండాకు చెందిన కేతావత్ సోమ్‌లాల్‌నాయక్ భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించడంతో సాహితీవేత్తగా కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందజేసింది. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కూరెళ్ల విఠలాచార్య తన సొంతింటిని గ్రంథాలయంగా మార్చి రెండు లక్షలకు పైగా పుస్తకాలు సమకూర్చి సమాజానికి అంకితం చేశారు. సాహితీవేత్త సమాజానికి అంకితం చేయడంతో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసింది. ఆలయ శిల్ప నిర్మాణ శాస్త్రంలో డాక్టర్ ఆనందాచారి వేలు తిరుపతి శిల్ప కళాశాలలో శిక్షణ పొంది దేవాదాయ శాఖలో అంచెలంచెలుగా ప్రధాన స్తపతి, సలహాదారుగా విధులు నిర్వహించారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, యాదాద్రి ఆలయ గోపురాల పునర్నిర్మాణంలో తన శిల్ప కళా నైపుణ్యాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు అందజేశారు.

\- భువనగిరి రూరల్

స్తపతి ఆనందాచారి వేలు



అవార్డు అందుకుంటున్న స్తపతి వేలు

ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన స్తపతి డాక్టర్ ఆనందాచారి వేలు తన చిన్నతనం నుంచే చిత్రాలు, బొమ్మలు గీస్తూ ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల మన్ననలను పొందారు. అంచెలంచెలుగా ఎదిగిన ఆయన ఆలయ శిల్ప నిర్మాణ శాస్త్రంలో ప్రవీణ్యం పొందారు. తిరుపతి శిల్ప కళాశాలలో శిక్షణ పొందిన ఆయన దేవాదాయ శాఖలో ప్రధాన స్తపతి, సలహాదారుడిగా విధులు నిర్వహించారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, యాదాద్రి ఆలయ గోపురాల పునర్నిర్మాణంలో తన శిల్ప కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. దేవాదాయ శాఖ ప్రధాన స్తపతిగా 2010 సంవత్సరంలో రిటైర్ అయిన ఆయనకు ప్రభుత్వం రెండు సంవత్సరాల పొడగింపుతో సలహాదారుడిగా నియమించింది. ఆ తర్వాత ఆయన యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములై అపురూప శిల్పాలతో ప్రకార మండపాలు, సప్త గోపురాల నిర్మాణం చేపట్టారు. ఆలయ శిల్ప కళలో అత్యంత ప్రతిభ కనబర్చిన ఆనందాచారి వేలును కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 25న పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ నెల 9న ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ నుంచి పద్మశ్రీ అవార్డును అందుకున్నారు.

కేతావత్ సోమ్‌లాల్‌నాయక్



రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న కేతావత్ సోమ్‌లాల్ నాయక్

భువనగిరి మండలం ఆకుతోట బావితండాకు చెందిన కేతావత్ సోమ్‌లాల్‌నాయక్ నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఆయన 701 శ్లోకాల ద్వారా భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించారు. అనువాదం పూర్తయిన 20ఏళ్ల తర్వాత బంజారా భగవద్గీత 2014 సంవత్సరంలో ప్రచురితమైంది. భగవద్గీతను అనువదించినందుకు గాను సోమ్‌లాల్‌నాయక్‌కు కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి 25వ తేదీన ఆయనను పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. 2024 ఏప్రిల్ 22వ తేదీన ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఆయన అవార్డు అందుకున్నారు.

డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య



ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో సామాన్య కుటుంబంలో జన్మించిన కూరెళ్ల విఠలాచార్య తన సొంత ఇంటినే గ్రంథాలయంగా మార్చారు. అందులో రెండు లక్షలకుపైగా పుస్తకాలను సమకూర్చి సమాజానికి అంకితం చేశారు. సాహిత్య ప్రజాసేవ అందిస్తున్న విఠలాచార్యను మన్‌కి బాత్ కార్యక్రమంలో 2021 సంవత్సరం లో ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల దాశరథ పురస్కారంతో తెలంగాణ ప్రభుత్వం విఠలాచార్యను గౌరవించింది. ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఆయన కు పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 9వ తేదీన ఢిల్లీ లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రదానం చేశారు.

పద్మవిభూషణుడు రావి నారాయణరెడ్డి



భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో 1908 సంవత్సరంలో రావి గోపాల్‌రెడ్డి, వెంకటరమణమ్మ దంపతులకు జన్మించారు రావి నారాయణరెడ్డి. తన 20వ ఏటా భూస్వామ్య కుటుంబ విలాస జీవితాన్ని తృణప్రాయంగా భావించి స్వాతంత్ర పోరాటంతో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. 1928లో ఆంధ్ర మహాసభకు సభ్యుడిగా, 1941, 1944, 1945లో అధ్యక్షుడిగా కొనసాగి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. 1934 సంవత్సరంలో మహాత్మాగాంధీ చేపట్టిన సహాయ నిరాకరణ ఉద్యమంలో దేశ పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భర్తను చూసేందుకు వచ్చిన అతని సతీమణి సీతమ్మ ఒంటిపై ధరించిన 50తులాల బంగారు ఆభరణాలను ఉద్యమ నిర్వాహణకు విరాళంగా ఇచ్చారు. 1952లో జరిగిన భారత దేశ మొదటి సార్వత్రిక ఎన్నికల్లో పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్(పీడీఎఫ్) అభ్యర్థిగా పోటీ చేసి 3,09,162 ఓట్లు సాధించి దేశంలోనే అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే భారీ మెజార్టీ సాధించిన వ్యక్తిగా నిలిచారు. 17-04-1952న మొట్టమొద టి స్వాతంత్ర్య భారత పార్లమెంట్‌ను రావినారా యణరెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. 1952, 1962లో నల్లగొండ పార్లమెంట్ సభ్యుడిగా, 1957 సంవత్సరంలో భువనగిరి ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టారు. 1967లో స్వచ్ఛందంగా రాజకీయాలకు విరమణ ప్రకటించి నిస్వార్థ జాతీయ స్థాయి నేతగా పేరొందారు. 1991 సెప్టెంబరు 7వ తేదీన రావినారాయణరెడ్డి కనుమూశారు. నిరంతర జీవితం సామాజిక సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992 సంవత్సరంలో పద్మవిభూషన్ అవా ర్డు ప్రకటించింది. ఆయన సతీమణి సుశాలమ్మకు ప్రదానం చేశారు.

హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, మే 13: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి అమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధం ఆలయంగా కొనసా గుతున్న పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారికి శివాలయంలో స్ఫటిక మూ ర్తులకు శైవాగమ శాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాల యంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారలను మేల్కొలిపిన అర్చకస్వాములు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివా లయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్స మూర్తులకు పట్టు వస్త్రాలు, వజ్రవైడూర్యాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తుల రద్దీ సాధారణంగా ఉందని అధికారులు తెలిపారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.24,71,283లఆదాయ సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.



ప్రధానాలయంలో నిత్య కల్యాణ పూజల్లో పాల్గొన్న పూజారులు

జవహర్ నవోదయ ఫలితాలు విడుదల

పెద్దవూర, మే 13: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చలకుర్తి క్యాంప్ జవహర్ నవోదయ విద్యాలయలో 2023- 24 విద్యా సంవత్సరం 10, 12 తరగతుల పరీక్షా ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో 80 మందికిగాను 80 మంది (వంద శాతం) ఫలితాలు సాధించినట్లు, కుర్ర కృష్ణప్రసాద్ 97శాతంతో మొదటి ర్యాంకు, పంతంగి అఖిలేష్ 96శాతంతో 2వ ర్యాంకు, బుర్ర శిరీష 95శాతంతో 3వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. 12వ తరగతి ఫలితాల్లో 28 మందికిగాను 28 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆలేటి స్టాలిన్ 91 శాతంతో మొదటి ర్యాంకు, రమావత్ మహేందర్ 90శాతంతో 2వ ర్యాంకు, ఎల్క కౌశిక్ 85శాతంతో 3వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. చలకుర్తి నవోదయలో చదివిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో అత్యుత్తమ ఫలితాలు సాధిచడం పట్ల ప్రిన్సిపాల్ ఆర్.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు అభినందించారు.



కుర్ర కృష్ణప్రసాద్, ఆలేటి స్టాలిన్

విజయ తీరాలకు చేరేదెవరో?

● ఫలితం తేలేది 22 రోజుల తర్వాతే ● జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ● జూన్ 2 సాయంత్రం 6.30 తర్వాత ఎగ్జిట్ పోల్స్ ● అప్పటి వరకు అభ్యర్థులలో నరాలు తెగేంత ఉత్కంఠ

భువనగిరి టౌన్, మే 13: పార్లమెంట్ ఎన్నికల సమరం సోమవారం సాయంత్రం 6 గంటలతో ముగిసింది. అభ్యర్థుల రాజకీయ భవిష్యత్తు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. విజయ తీరాలకు చేరేదెవరో మాత్రం జూన్ 4వ తేదీ మధ్యాహ్నానికి తేలనుంది. దీంతో 22రోజుల పాటు అభ్యర్థులు, పార్టీల నాయకులు, మద్దతుదారులలో నరాలు తెగేంత ఉత్కంఠకు గురవుతుండగా, తాము ఓటు వేసిన అభ్యర్థి గెలుస్తాడో లేదోనని ఓటర్లలో ఆసక్తి నెలకొంది. ఎగ్జిట్ పోల్స్‌ను కూడా జూన్ 2 సాయంత్రం 6.30 గంటల తర్వాతనే విడుదల చేయాలని ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే ఆదేశించిన నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు, ఓటములను అంచనా వేసేందుకు పలువురు పల మార్గాలలో ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థులు, పార్టీలు పోలింగ్ రోజున విస్తృతంగా సర్వేలు చేయించి గెలుపు ఓటములపై అంచనాలకు వస్తున్నారు. అయినప్పటికీ సర్వే ఫలితాలు వందశాతం నిజమయ్యే పరిస్థితులు తక్కువగా ఉండడంతో అందరికంటే ఎక్కువగా అభ్యర్థుల్లో గుబులు క్రమేపీ పెరిగే అవకాశాలు ఉంటాయి. ఎన్నికలు జరిగిన నాటితో పోలిస్తే కౌంటింగ్ తేదీ సమీపిస్తున్నా కొద్ది చర్చల తీరు, అంచనాలపై ఊహాగానాలు మారుతుంటాయి. ఆ ఊహాగానాలు ఈవీఎంలలో సంక్షిప్తమైన ఓట్లపై ఎలాంటి ప్రభావం చూపే అవకాశాలు లేనప్పటికీ, ఎన్నికల ఫలితాలపై ఆసక్తి చూపే వారిలో బీపీ, ఆవేశాలు, ఉత్కంఠ హెచ్చు తగ్గులవుతుంటాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పోలీసు శాఖ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సెంట్రల్ ఇంటలీజెన్స్ నివేదికల ఆధారంగా గెలుపు ఓటములను అంచనా వేయనుండగా మిగితా ప్రతిపక్ష పార్టీలు మాత్రం సొంతంగా నియమించుకున్న సర్వే బృందాల నివేదికలపై ఆధార పడ్డాయి. పార్టీలతో నిమిత్తం లేకుండా పలువురు అభ్యర్థులు సొంత టీంల ద్వారా ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి సర్వే చేయించగా పోలింగ్ రోజున కూడా నియోజకవర్గమంతటా సర్వే చేయించారు. సర్వే బృందాల నివేదికల ఆధారంగా ఎన్నికల రోజు సోమవారం అభ్యర్థులు, నాయకులు గెలుపు కోసం తుది విడత ప్రయత్నాలు చేయడం గమనార్హం.


యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటేసేందుకు వచ్చిన ఓటర్లు

గుర్రంపై వచ్చి ఓటు వేసి..

మేళ్లచెర్వు: సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలంలోని రేబల్లె గ్రామ మాజీ సర్పంచ్ ఇనుప కుంతికెల నర్సింహమూర్తిశర్మ తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రానికి గుర్రంపై వచ్చారు. అందరిలో వినూత్నంగా ఉండేందుకే గుర్రంపై వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నానని ఆయన తెలిపారు. తమ పూర్వికుల నుంచి గుర్రపు స్వారీ అలవాటు ఉండడంతో గుర్రంపై వచ్చి ఓటు వేసానని తెలిపారు.


గుర్రంపై వస్తున్న మాజీ సర్పంచ్

యూఎస్ నుంచి పోలింగ్ స్టేషన్‌కు..


మేఘన

మిర్యాలగూడ టౌన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన రుద్రోజు మేఘన యూఎస్(అమెరికా) నుంచి వచ్చి ఓటేసింది. గతేడాది అమెరికా వెళ్లిన ముఘన న్యూయార్క్ ఆల్బనీ యూనివర్సిటీలో ఎంఎస్ చదువుతోంది. రెండవ సెమిస్టర్ అనంతరం యూనివర్సిటీ సెలవులు ప్రకటించడంతో ఇండియా వెళ్లాలని భావించింది. సోమవారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగిన మేఘన మధ్యాహ్నం మిర్యాలగూడ చేరుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని 88వ పోలింగ్ కేంద్రంలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంది.

మోత్కూరు: ఉన్నత చదువుల కోసం మోత్కూరు జడ్పీటీసీ గోరుపల్లి శారదసంతోష్‌రెడ్డి పెద్దకూతురు తరుణి అమెరికా వెళ్లింది. ఆమెకు తొలిసారి ఓటు హక్కు లభించింది. ఆమె ఈ నెల 17న ఇండియాకు రావాల్సి ఉండగా తన ఓటు హక్కు వినియోగించుకోవాలన్న సంకల్పంతో ఈ నెల 12న హైద్రాబాదుకు వచ్చింది. సోమవారం తన స్వగ్రామం అనాజిపురం వచ్చి ఆమె చెల్లి విశాలక్షితో కలిసి ఓటు హక్కు వినియోగించుకుంది.


కళావతి

ఓటు వేసిన నాలుగు తరాలు

● యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన ఉల్లి సక్కుబాయి(85), ఆమె కుమార్తె చొల్లేటి కళావతి(60), సరస్వతి కుమార్తె ఉల్లి శివరంజని(40), ఆమె కుమార్తె హంపి(19) ఇలా... నాలుగు తరాల కుటుంబం మోత్కూరులో తమ ఓటు హక్కు వినియోగించుకుంది.



తొమ్మిది పదులు దాటినా..



● తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పెన్నా అనంతరామశర్మ 90సంవత్సరాల వయసులోనూ కట్టంగూరు మండలం పిట్టంపల్లి గ్రామంలో తన ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటేసిన ప్రముఖులు..

● నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన క్యూలైన్‌లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా కేంద్రంలోని చెన్నకేశవ మెమోరియల్ స్కూల్‌లోని 69వ పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ ఓటు వేశారు. ఎకో ఫ్రెండ్లీ పోలింగ్ కేంద్రం అందరినీ ఆకట్టుకుంది. పోలింగ్ కేంద్రం ఆవరణలో ఏర్పాటుచేసిన అరటి బోదెలు, పూల మొక్కలు, చిలకల బొమ్మలు ఓటర్లకు స్వాగతం పలికాయి.

● శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తమ కుటుంబీకులతో సహా నల్లగొండలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి పద్మావతి ఉత్తమ్ కోదాడలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఈవీఎంపై సిరా చుక్క.. నాయకుల అభ్యంతరం

రాజాపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలో 40 బూత్‌లను ఏర్పాటు చేశారు. మండలంలోని సింగారం గ్రామంలో 40నిమిషాల పాటు పోలింగ్‌ను ఆపేశారు. 2.50గంటల నుంచి 3.30 గంటల వరకు పోలింగ్ నిలిచిపోయింది. పోలింగ్‌స్టేషన్లలోని 86 బూత్‌లో ఈవీఎంలపై ఎన్నికల గుర్తులో చేతి గుర్తుపై సిరా మరక ఉండడంపై బీజేపీ నేతలు అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఈవీఎంలో సిరా మరక ఉన్న గుర్తుపై ఓటు వేయాలని కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించి ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడంతో 40నిమిషాల పాటు పోలింగ్ నిలిపివేసి సరి దిద్దడంతో సమస్య సద్దుమనిగి తిరిగి పోలింగ్ ప్రారంభించారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రీ పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు.

వలిగొండ: మండల కేంద్రంలో 255 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడం వల్ల ఓటింగ్ 30 నిమిషాలు ఆలస్యమైంది.

మొరాయించిన ఈవీఎంలు

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని ఉరుమడ్ల, నేరడ గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ కొద్దిసేపు నిలిచిపోయింది. అధికారులు వెంటనే సరిచేశారు. మండలంలోని గుండ్రాంపల్లిలోని 62వ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రారంభమైన కాసేపటికే ఈవీఎంలు మొరాయించడంతో అక్కడ గంటసేపు పోలింగ్ నిలిచింది. తర్వాత ఈవీఎంలను సరిచేయడంతో యథావిధిగా పోలింగ్ కొనసాగింది.

హాలియా: సాగర్ నియోజకవర్గ పరిధిలోని హాలియా పట్టణంలో 162 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో కొద్ది సేపు పోలింగ్ ఆలస్యం అయింది. ఆతరువాత ఎన్నికల సిబ్బంది ఈవీఎంను మార్చికొత్త ఈవీఎంను ఏర్పాటు చేయడం వల్ల పోలింగ్ యధావిధిగా కొనసాగింది. పెద్దవూర మండలంలోని రామన్నగూడెంలో 81 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడం వల్ల 20 నిమిషాల పాటు పోలింగ్ ఆలస్యం అయింది. నిడమనూరు మండలంలోని బంకాపురం గ్రామంలో 87వ బూత్‌లో ఈవీఎం మొరాయిండంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.

చౌటుప్పల్ టౌన్: మునిసిపాలిటీలోని లింగోజీగూడ లో గల 27 వ పోలింగ్ బూత్ లో 40 నిమిషాల పాటు ఈవీఎం మొరాయించింది. దీంతో ఉదయం 7.40 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.

మర్రిగూడ: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో తమడపల్లి, రాంరెడ్డిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు ఈవీఎం మొరాయించడంలో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధులు, యువత కూర్చున్నారు. అధికారులు స్పందించి రెండు కేంద్రాల్లో ఈవీఎంలను ఏర్పాటు చేసి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా తిరిగి కొత్త ఈవీఎంలను ఏర్పాటు చేసి ఓటు వేసుకునే విధంగా ఏర్పాటు చేశారు.

ఆత్మకూరు(ఎం): యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని ఖప్రాయిపల్లి, టీ.రేపాక పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. టీ రేపాకలో ఈవీఎం మొరాయించగా స్పేర్ ఈవీఎంతో ఓటింగ్ నిర్వహించారు. దీంతో ఇక్కడ సుమారు 20 నిమిషాలు పోలింగ్ ఆగింది. ఖప్రాయిపల్లి పోలింగ్ కేంద్రంలో చివరగా ఇద్దరు ఓటర్లు ఓటువేయడానికి ఉండగా ఈవీఎం మొరాయించింది, అధికారులు వచ్చి ఇక్కడ కూడా స్పేర్ ఈవీఎంతో పోలింగ్ పూర్తి చేశారు. ఈవీఎం మొరాయింపుతో సుమారు 45 నిమిషాలు ఆలస్యమైంది.

పాలకవీడు: సూర్యాపేట జిల్లా పాలకవీడు శూన్యపహాడ్ గ్రామంలోని బూత్‌నెంబరు 53లో మాక్ పోలింగ్ సమయంలో ఈవీఎం మొరాయించింది. ఏజెంట్‌లు తమ తమ గుర్తులకు ఓటు వేసే సమయంలో నోటాకు పడుతుండడంతో టెక్నికల్ సిబ్బందిని పిలిపించి మరమ్మతులు చేయించారు.

పెన్‌పహాడ్: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని జల్మాల్‌కుంట తండాలో ఈవీఎం గంటసేపు మొరాయించడంతో ఓటర్లు ఆందోళనకు దిగారు. స్పందించిన ఎన్నికల సిబ్బంది హుటాహుటిన వెళ్లి సమస్యను పరిష్కరించారు.

సూర్యాపేట రూరల్: సూర్యాపేటజిల్లా సూర్యాపేట మండలం పిల్లలమర్రిలో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్‌కు కొద్ది సేపు అంతరాయం ఏర్పడింది.

నేరేడుచర్ల: మండలంలోని కల్లూరు గ్రామంలో ఈవీఎం మొరాయించడంతో 8.30వరకు పోలింగ్ ప్రారంభం కాలేదు. పత్తేపురం పోలింగ్ కేంద్రంలోని ఈవీఎం వద్ద చీకటిగా ఉండడంతో విద్యుత్ బల్బును ఏర్పాటు చేశారు.

సోషల్‌మీడియాలో వీవీప్యాడ్ స్లిప్.. యువకుడిపై కేసునమోదు

మిర్యాలగూడ అర్బన్: ఓటుహక్కు వినియోగించుకున్న ఓ యువకుడు వీవీప్యాడ్‌లోని పోలింగ్‌స్లిప్‌ను ఫొటోతీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టాడు. సోమవారం ఉదయం జరిగిన ఈ సంఘటనపపై రూరల్ పోలీసులు ఆరా తీసి యువకుడి వివరాలు తెలుసుకున్నారు. పోలీసుల విచారణలో మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని 164 పోలింగ్ స్టేషన్‌లో ఓటువేసిన వస్కుల మధు అనే యువకుడిగా రూరల్‌పోలీసులు గుర్తించారు. పోలింగ్‌స్టేషన్ పీవో నారయ్య ఫిర్యాదు మేరకు ఎన్నికల నియమావళి నిబంధనల ఉల్లంఘన చట్టం కింద సదరు యువకుడు మధుపై కేసు నమోదు చేసినట్లు సీఐ వీరబాబు తెలిపారు.

మిర్యాలగూడలో టెండర్‌ఓటు వేసిన దంపతులు

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన దంపతులిద్దరూ టెండర్ ఓటు ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని సీతారాంపురం కాలనీకి చెందిన ఇక్క లక్ష్మీనారాయణ, ఉమారాణి దంపతులకు స్థానిక నవజీవన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 74పోలింగ్‌బూత్‌లో ఓటు ఉంది. అయితే మధ్యాహ్నం సదరు దంపతులిద్దరు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లగా అప్పటికే వారిద్దరి ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారి తెలిపారు. ఈ విషయాన్ని ప్రిసైడింగ్ అధికారి దృష్టి తీసుకెళ్లగా 7(బీ)ఫాం జారీ చేసి టెండర్‌ఓటు జారీచేయగా, సదరు దంపతులు బ్యాలెట్ పత్రాలపై ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా 74పోలింగ్ బూత్‌లో జరిగిన ఈ సంఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారు.


టెండర్ ఓటు వేస్తున్న దంపతులు

కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ

డిండి: నల్లగొండ జిల్లా డిండి మండలంలో సమస్యాత్మక గ్రామమైన దేవత్‌పల్లితండాలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరు పార్టీల కార్యకర్తలు పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈ క్రమంలో భయంతో పరిగెత్తిన రమావత్ మారి కిందపడిపోవడంతో ఆమె చేయి విరిగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం దేవరకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తండాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.


గాయపడిన మహిళ

ఓటమి భయంతోనే మద్యం, డబ్బు పంపిణీ

● భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్

రామన్నపేట, మే 13: ఓటమి భయంతోనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నీచ రాజకీయాలు ఒడికట్టాయని, విచ్చలవిడిగా డబ్బు, మద్యాన్ని పంపిణీ చేశాయని భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ. జహంగీర్ ఆరోపించారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ఎన్నికల సరళిని పరిశీలించిన అనంతరం రామన్నపేటలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను ప్రలోభాలకు గురి చేశాయని, గ్రామాల్లో మద్యం, డబ్బులు పంపిణీ చేస్తున్నా పోలీసులు, ఎన్నికల అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. ఓటమి భయంతోనే ఆ పార్టీలు డబ్బు రాజకీయాలను నమ్ముకున్నారని, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. పోచంపల్లి మండలం కనుముకులలో రైతులు పంటకు బి గ్రేడ్ ధర ఇస్తున్నారని నిరసన వ్యక్తం చేశారని కొద్దిసేపు పోలింగ్‌లో పాల్గొనలేదన్నారు. ప్రభుత్వాలు రైతుల ఆవేదన గుర్తించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో పలు చోట్ల సాంకేతిక లోపం తలెత్తడంతో ఈవీఎంలు మొరాయించాయని ఓటర్లు ఇబ్బందులు పడ్డారని ఇది ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఆయన వెంట సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జెల్లల పెంటయ్య, గడ్డం వెంకటేశం, పట్టణ కార్యదర్శి గాదె నర్సింహ, నాయకులు గొరిగె సోములు, కందుల హనుమంతు, సత్యం, మునుకుంట్ల లెనిన్, రాసాల రమేష్, కుందూరు వెంకన్న, పిట్టల శ్రీనివాస్, అశోక్, వేముల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


రామన్నపేటలో విలేకరులతో మాట్లాడుతున్న భువనగిరి సీపీఎం అభ్యర్థి జహంగీర్

మేమూ ఓటేశాం..

లోక్‌సభ ఎన్నికల్లో కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమకు ఓటు హక్కు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. తాము నిర్భయంగా ఓటు వేశామని తెలిపారు.

మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్నా



మొదటి సారిగా ఓటు హక్కు వినియోగించుకోవడం కొత్త అనుభూతినిచ్చింది. ఓటు హక్కును వినియోగించుకోవడం బాధ్యతగా భావించి ఓటు వేశాను. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందనే విషయాన్ని అందరూ గుర్తించాలి. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం బాధ్యతగా గుర్తించి ఓటు వేయాలి.

కంచర్ల అభినవరెడ్డి, కొండమల్లేపల్లి, నల్లగొండ జిల్లా

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నా



మొదటి సారిగా ఓటు హక్కును ప్రజాస్వామ్య పద్ధతిలో వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేశా.

నిమ్మనగోటి కావ్యశ్రీ, శాలిగౌరారం మండలం గురజాల గ్రామం.

రాజ్యాంగ బద్ధంగా ఓటు హక్కు వినియోగించుకున్నాను



రాజ్యాంగ బద్ధంగా సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు ద్వారా లభించింది. నూతనంగా ఓటు వేయడం వల్ల తాను భారతదేశ పౌరుడిగా చాలా సంతోష పడ్డా. అందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి.

గద్దపాటి శివసాయి, శాలిగౌరారం మండలం, శాలిలింగోటం గ్రామం.

ఆస్పత్రి నుంచి నుంచి పోలింగ్ బూత్‌కు

● యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన మెరుగు యతినందం అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి వైద్యుల సహకారంతో పోలింగ్ కేంద్రం 168 పోలింగ్ బూత్‌లో ఓటును సద్వినియోగం చేసుకున్నాడు.



● **భువనగిరి రూరల్:** భువనగిరి మండలంలోని గౌసనగర్‌లోని 31పోలింగ్ స్టేషన్‌లో సాంకేతిక కారణంగా ఈవీఎం 10 నిమిషాల పాటు మొరాయించడంతో అధికారులు వెంటనే మరమ్మతులు చేశారు. పోలింగ్ యథావిధిగా కొనసాగింది.


నల్లగొండలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి వెంకట్‌రెడ్డి


నాగార్జునసాగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న జానా, రఘువీర్‌రెడ్డి


నల్లగొండలో ఓటు హక్కు వినియోగించుకున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఓటు వేసిన ప్రముఖులు

లోక్‌సభ ఎన్నికల్లో ప్రముఖులు తమ కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తమ కుటుంబసభ్యులతో కలిసి నల్లగొండలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ కోదాడలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి నాగార్జునసాగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం ఆకట్టుకుంది. అరటి ఆకులు, బెలూన్స్, పూలతో అలంకరించి, పచ్చిక బయళ్ల ఏర్పాటు చేశారు. గ్రీన్ కార్పెట్ల ద్వారా స్వాగతం పలికారు.


నల్లగొండలో ముస్తాబు చేసిన ఎకో ఫ్రెండ్లీ పోలింగ్ కేంద్రం


చిట్యాల: నేరడలో ఓటు వేసి వస్తున్న వృద్ధ దంపతులు


నల్లగొండలో అరటి ఆకులతో ముస్తాబు చేసిన ఎకో ఫ్రెండ్లీ పోలింగ్ కేంద్రం


యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ముస్తాబు చేసిన పోలింగ్ కేంద్రం



నల్లగొండలో ఓటు వేసిన కుటుంబం








ఓటు హక్కు వినియోగించుకున్న భువనగిరి, నల్లగొండ ఎంపీ అభ్యర్థులు క్యామ మల్లేష్, కంచర్ల కృష్ణారెడ్డి(బీఆర్ఎస్), ఎండీ. జహంగీర్(సీపీఎం), చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి (కాంగ్రెస్), బూర నర్సయ్యగౌడ్, శానంపూడి సైదిరెడ్డి(బీజేపీ)

ప్రశాంతంగా పోలింగ్

భువనగిరి పార్లమెంట్ స్థానానికి సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ పార్లమెంట్ స్థానం యాదాద్రిభువనగిరి జిల్లాతో పాటు నల్లగొండ, సూర్యాపేట, జనగామ, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. ఆలేరు, భువనగిరి, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి, ఇబ్రహీంపట్నం, జనగాం నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. చెదురు ముదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.


బీబీనగర్ మండలం గూడూరులో ఓటు వేసేందుకు బారులుదీరిన ప్రజలు

భువనగిరి నియోజకవర్గంలో..


భువనగిరిలో ఓటుహక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు

భువనగిరి టౌన్/ భువనగిరి రూరల్, మే 13: పార్లమెంట్ నియోజక వర్గ కేంద్రమైన భువనగిరిలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం కాస్త పుంజుకొని సాయంత్రం పోలింగ్ బూత్‌లలో ఓటర్లు బారులు తీరారు. పట్టణంలోని 43 పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన బూత్ లలో 47,274 మంది ఓటర్లలో 73శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వేసవి తీవ్రత నేపథ్యంలో పోలింగ్ సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు అనగా గంట పాటు అదనంగా పొడగించినప్పటికీ పలు కారణాలతో పోలింగ్ బూత్‌లకు ఆలస్యంగా వచ్చిన ఓటర్లతో చీకటి పడే వరకు పోలింగ్ కొనసాగింది. గతంతో పోలిస్తే పోలింగ్ బూత్‌ల వద్ద రాజకీయ పార్టీల సందడి, ప్రచార సరళి తగ్గింది. కాగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు పట్టణమంతటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మునిసిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, మునిసిపల్ వైస్‌ఛైర్మన్ మాయ దశరథ, తదితర ప్రముఖులు తమ బూత్‌లలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. భువనగిరి మండలంలోని గొసనగర్‌లోని 31పోలింగ్ స్టేషన్‌లో సాంకేతిక కారణంగా ఈవీఎం 10 నిమిషాల పాటు మొరాయించడంతో అధికారులు వెంటనే మరమ్మత్తులు చేపట్టడంలో ఎన్నికల ప్రక్రియ యధావిధిగా కొనసాగింది. అదే విధంగా ఆదివారం రాత్రి వర్షం కురువడంతో కేసారం, బండ సోమారం, వీరవెల్లి, పోలింగ్ కేంద్రాల ఆవరణలు చిత్తడిగా మారడంతో ఓటర్లు ఇబ్బందులకు పడ్డారు. ఎన్నికల అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ క్రిష్టిమయుమ్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పోలింగ్ సరళిని తహసీల్దార్ ఎన్ అంజిరెడ్డితో కలిసి పరిశీలించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మండలంలోని నమాత్‌పల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు, అతికం రుక్కమ్మ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పలు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జడ్పీఛైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి వడపర్తిలో, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అనంతారంలో, జిట్ట బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు బొమ్మాయిపల్లిలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్ నాగిరెడ్డిపల్లిలో, పీఏసీఎస్ ఛైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి అనాజీపురంలో, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య పెంచికల్ పహడ్‌లో, ఎంపీపీ నరాల నిర్మల బస్వాపురంలో, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి బియన్ తిమ్మాపూర్‌లో, యాదగిరిగుట్ట ఈవో ఏపూరి భాస్కర్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి రాయిగిరిలోని పోలింగ్ స్టేషన్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బీబీనగర్: మండలంలో మొత్తం 42,134 మంది ఓటర్లు ఉండగా 35,183మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 15,635మంది, మహిళ ఓటర్లు 17,548మంది, 45పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు. కాగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీబీనగర్ రహీంఖాన్‌గూడెం, రుద్రవెల్లి పోలింగ్ స్టేషన్లను సందర్శించి పోలింగ్ సరళిని ప్రరిశీలించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి తన మాతృమూర్తితో కలిసి ఆయన స్వగ్రామం గూడూరులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, జడ్పీటీసీ గోళి ప్రణీత పింగల్ రెడ్డి దంపతులు బీబీనగర్‌లో ఓటు హక్కు వినియోగించుకోగా మాజీ జడ్పీఛైర్మన్ కసిరెడ్డి నారాయణ రెడ్డి తన స్వగ్రామం వెంకిర్యాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వలిగొండ: మండల కేంద్రాంలో 255 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరగించడం వల్ల ఓటింగ్ 30 నిమిషాలు ఆలస్యం అయింది. అధికారులు వెంటనే సంకేతిక లోపాన్ని సరిచేయడంతో ఓటింగ్ ఎదవిధిగా కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత ఓటింగ్ సరళి తగ్గింది. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కుటుంబసభ్యులతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వర్కట్‌పల్లిలో మాజీ మంత్రి ఎలిమినేటి ఉమామాధవరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వేములకొండలో స్వతంత్ర అభ్యర్థి వేముల నరేందర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. సీపీఎం అభ్యర్థి ఎండి జహంగీర్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. వలిగొండ, టేకులసోమారం పోలింగ్ కేంద్రాలలో రాచకొండ పోలీస్ కమీషనర్ తరుణ్‌జోషి సందర్శించి సిబ్బంది తగిన సూచనలు చేశారు. గోకారంలో ఎంపీపీ నూతి రమేష్ రాజు, అర్రూరులో జడ్పీటీసీ పద్మఅనంతరెడ్డి, సంగెంలో పీఎసీసీ ఛైర్మన్ సూరకంటి వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉమా బాలనర్సింహ ఓటు వేశారు.

భూదాన్‌పోచంపల్లి : మండల వ్యాప్తంగా 85.87% పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 43,741 ఓట్లు ఉండగా అందులో పురుషులు 21,528 మంది, మహిళలు 21,741 మంది ఉన్నారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా పోలింగ్ సాగింది.

మునుగోడు నియోజకవర్గంలో..


ఓటు హక్కును వినియోగించుకున్న చౌటుప్పల్ మునిసిపల్ వైస్ చైర్మన్ రాజు కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి దంపతులు

చౌటుప్పల్ టౌన్: మండల పరిధిలో 85.72 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. మండలంలోని 64,213 మంది ఓటర్లకుగాను 75 పోలింగ్ బూత్‌ల ద్వారా 55,042 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 27,703 మంది పురుషులు, 27,339 మంది స్త్రీలు తమ ఓటు హక్కు ను సద్వినియోగం చేసుకున్నారు. ఉదయం 6.30 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9 గంటలకు 8,900 ఓట్లు (13.86 శాతం), 11 గంటలకు 20,227 ఓట్లు (31.50), మధ్యాహ్నం ఒంటి గంటకు 31,148 ఓట్లు (48. 51), మధ్యాహ్నం 3 గంటలకు 43,812 ఓట్లు (68.23), సాయంత్రం 5గంటలకు 52, 356 ఓట్లు (81.53), 6 గంటలకు పోలయ్యాయి. తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీవో సందీప్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వరనాయక్, సీఐ అశోక్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయి. ఇది ఇలా ఉండగా, మండలంలోని 75 పోలింగ్ బూత్ లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని సీఐ అశోక్ రెడ్డి తెలిపారు. అందుకు సహకరించిన రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ఓటర్లకు సీఐ కృతజ్ఞతలు తెలిపారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి జడ్పీహెచ్ఎస్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను రాచకొండ సీపీ తరుణ్ జోషి సందర్శించారు. పోలింగ్ సరళిని సమీక్షించారు. సీపీ వెంట ఏసీపీ మధుసూదన్ రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి ఉన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పోలింగ్ కేంద్రాన్ని సోమవారం భువనగిరి పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ ఇంచార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సందర్శించి, పోలింగ్ సరళిని సమీక్షించారు.


చౌటుప్పల్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగజోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం: మండలంలో మొత్తం 39,540 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 33,721 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు. 17,175 , స్త్రీలు16,546 ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 85.28శాతం పోలింగ్ నమోదయింది. జనగాం గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పోలింగ్ కేంద్రం ముందు వర్షపు నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని లింగంవారిగూడెం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మల్లారెడ్డిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చెల్లమల్ల కృష్ణారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన చిలువేరు శ్రావణి ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లగా అప్పటికే ఆమె ఓటు వినియోగించుకున్నట్లు రికార్డుల్లో నమోదయింది. దీంతో శ్రావణి తాను ఓటు వేయలేదని ఇప్పుడే పోలింగ్ కేంద్రానికి వచ్చానని తెలిపారు.

నకిరేకల్ నియోజకవర్గంలో..

రామన్నపేట, మే 13: మండలంలో 59 పోలింగ్ కేంద్రాలలో 78.14 శాతం పోలింగ్ జరిగినట్లు మండల ఎన్నికల అధికారి తహసీల్దార్ సి.లాల్ బహద్దూర్ తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో రామన్నపేట 33, వెల్లంకితో పాటు పలు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో గంటపాటు పోలింగ్ ఆలస్యంగా జరిగింది. బీఎల్‌వోలు పోలింగ్ చీట్టీలను సరిగా పంపిణీ చేయలేకపోవడంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. పోలింగ్ సరళిని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వెల్లంకి, తుమ్మలగూడెం తదితర గ్రామాలను పర్యటించి పరిశీలించారు. రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్‌గౌడ్ మంజుల దంపతులు స్వగ్రామానికి చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.


హైకోర్టు జడ్జి లక్ష్మణ్‌గౌడ్ దంపతులు

తుంగతుర్తి నియోజకవర్గంలో..

మోత్కూరు : తుంగతుర్తి నియోజకవర్గంలో 74 శాతం పోలింగ్ నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే 13.51 శాతం పోలింగ్ తగ్గింది. నియోజక వర్గంలో 2,59,265 మంది ఓటర్లు ఉండగా 1,91,845 ఓట్లు పోలయ్యాయి. మోత్కూరు మండలంలో 27,074 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి మునిసిపాలిటీ పరిధిలో 17 పోలింగ్ బూత్‌లు, మండలంలోని ఇతర గ్రామాల్లో 14 పోలింగ్ బూత్‌లు మొత్తం 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మోత్కూరు మండల కేంద్రంలోని 1వ పోలింగ్ బూత్‌లో, మండలంలోని అనాజిపురం పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు సుమారు గంట పాటు మొరాయించి ఓటింగ్ నిలిచిపోయింది. సిబ్బందిని రప్పించి వాటిని మరమ్మతు చేయించి ఓటింగ్ కొనసాగించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ నాగరిగారి ప్రీతం తన సతీమణి స్రవంతి మోత్కూరులో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మోత్కూరు మునిసిపల్ ఛైర్‌పర్సన్ గుర్రం కవిత, ఆమె భర్త రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, వారి కోడలు జయస్వాతి మోత్కూరులో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్ మోత్కూరుతో పాటు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. సుమారు 20 రోజులుగా అనారోగ్యం (కాలునొప్పి)తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ మాజీ ఛైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకోవాలన్న సంకల్పంతో డాక్టర్ వద్ద అనుమతి తీసుకుని తన స్వగ్రామానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుని వెంటనే వెళ్లిపోయారు.


ఎమ్మెల్యే సామేల్ దంపతులు

అడ్డగూడూరు: మండల వ్యాప్తంగా 22769మంది ఓటర్లు ఉండగా పురుషులు 8652మంది, స్త్రీలు 8213మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా 74.07 ఓటు శాతం నయోదు అయ్యినట్లు అధికారులు తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మండలంలోని తన స్వగ్రామమైన ధర్మారంలో పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.


భువనగిరి నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకున్న మునిసిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పాశం భాస్కర్, చింతల వెంకటేశ్వర్లు, యాదగిరిగుట్ట ఆలయ ఈఈవో భాస్కర్‌రావు కుటుంబ సభ్యులు, మాజీ మంత్రి ఉమామాధవరెడ్డి, జడ్పీ ఛైర్మన్ సందీప్‌రెడ్డి, శతాధికవృద్ధురాలు అతికం రుకమ్మ, పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, గూడూరు నారాయణరెడ్డి, వలిగొండలో మహిళలు, మోత్కూరులో మునిసిపల్ ఛైర్‌పర్సన్ కవిత కుటుంబ సభ్యులు

ఆలేరులో నియోజకవర్గంలో..


ఆలేరులో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, మే 13: ఆలేరు మండలంలో మొత్తం ఓటర్లు 34,5414 మంది ఉండగా పురుషులు 16,896, మహిళలు 17,644 మంది, ఇతరులు 19 ఉండగా 27,208 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 78.77 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో పురుషులు 13,756, మహిళలు 13,451 ఇదరులు ఒకరు ఉన్నారు. నియోజకవర్గంలోని బొమ్మలరామారంలో 87.73 శాతం అధిక ఓటింగ్ కాగా, గుండాల మండలంలో 78.43 శాతం తక్కువ ఓటింగ్ జరిగింది. తుర్కపల్లిలో 87.58 శాతం, రాజాపేటలో 81.80 శాతం, యాదగిరిగుట్టలో 83.31 శాతం, మోటకొండూరులో 82.96 శాతం, ఆత్మకూరులో 79.04 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. ఆలేరులోని పోలింగ్ కేంద్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశంలు పరిశీలించారు. ఆలేరులో బంద్రు శోభారాణి దంపతులు, రాఘవపురంలో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జడ్పీటీసీ డాక్టర్ కుడుదుల నగేష్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బొమ్మలరామారం: బొమ్మలరామారం మండలంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 87.73 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై మందకొడిగా సాగింది. మధ్యాహ్నం అనంతరం ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరతలివచ్చారు. మండలంలోని ప్రముఖులు ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాజాపేట: మండలంలో 40 బూత్‌లను ఏర్పాటు చేశారు. పారుపల్లి గ్రామంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాజాపేట మండల కేంద్రంలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెంట రమేష్, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మోటకొండూర్ : మండలంలో మొత్తం 29 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మండలంలోని చందెపల్లి గ్రామంలోని 235వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో గంట సేపు పోలింగ్ నిలిచిపోయింది. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంతో ఓటింగ్ కొనసాగింది. మండల వ్యాప్తంగా మొత్తం 20,710 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 8728, మహిళాలు 8455 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 82.97 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ శాంతిలాల్ తెలిపారు.


ఆలేరు నియోజకవర్గంలో ఓటు హక్కును వినయోగించుకున్న మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్యగౌడ్ దపంతులు, కాంగ్రెస్ నేత బంద్రు శోభారాణి దంపతులు మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, టీఎమ్మార్పీఎస్ నేత వంగపల్లి శ్రీనివాస్ దంపతులు

ఆత్మకూరు(ఎం): మండలంలోని ఇప్రాయిపల్లి, టీ.రేపాక పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మోరాయించాయి. దీంతో అక్కడ ఓటింగ్ ఆలస్యంగా ముగిసింది. మండలంలో 24950 మంది ఓటర్లకు గాను 34 పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేయగా సోమవారం జరగిన ఎన్నికల్లో 22661మంది ఓట్లు వేశారు. అందులో 11639 పురుషులు, 11022 మహిళలు ఉన్నారు. మండలంలో 81 శాతం ఓటింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. టీ రేపాకలో ఈవీఎం మొరాయించగా స్పేర్ ఈవీఎంతో ఓటింగ్ నిర్వహించారు. దీంతో ఇక్కడ సుమారు 20 నిమిషాలు ఓటింగ్ ఆగింది. ఇప్రాయిపల్లి పోలింగ్ కేంద్రంలో చివరగా ఇద్దరు ఓటర్లు ఓటువేయడానికి ఉండగా ఈవీఎం మొరాయించింది. అధికారులు వచ్చి ఇక్కడ కూడా స్పేర్ ఈవీఎంతో ఎన్నిలు పూర్తిచేశారు. ఈవీఎం మొరాయింపుతో సుమార్ 45 నిమిషాలు ఆలస్యం అయ్యింది. మండలంలో ఓటింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మండలంలో ఓటింగ్ శాతం గురించి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మండల కాంగ్రెస్ నాయకులను అడిగి తెలుసుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఉన్నారు.

గుండాల: మండలంలో మొత్తం 25,656 ఓట్లకు గాను 78.43 శాతం 20,122 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 10,250, మహిళలు 9,872ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తుర్కపల్లి: మండలంలో 27425 ఓట్లకు గాను 24018 ఓట్లు పోల్‌కాగ 87.58శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ దేశ్యా తెలిపారు. తుర్కపల్లి మండల కేంద్రంలో 1919 ఓట్లకుగాను 1634 ఓట్లు పోలయ్యాయి. కాగా మండలంలో 31 పంచాయతీలకుగాను 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహించారు. కాగా మండల కేంద్రంలో సీఎం సీపీఆర్‌వో బోరెడ్డి అయోధ్యరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

హామీలన్నీ అమలు చేస్తాం

●భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మే 13 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి తీరుతుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం భూదాన్‌పోచంపల్లి మండల వ్యాప్తంగా జరిగిన పోలింగ్ నిర్వహణ, పట్టణంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కచ్చితంగా గెలిచితీరుతారని, దీంతో నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలైన మూసీ కాలుష్య నియంత్రణ, రూరల్ టూరిజం సెంటర్‌గా భూదాన్‌పోచంపల్లి పట్టణాభివృద్ధి, మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం, చేనేత కార్మికులకు నేతన్న భరోసా, అన్ని వర్గాల అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు బాటలు వేసినట్లు అవుతుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం తనతోపాటు ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని భువనగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 30వేల పై చిలుకు మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముందంజలో ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కుడికాల సుజన, మున్సిపల్ కౌన్సిలర్లు బోగ బానుమతి విష్ణు, మోటె రజిత రాజు, చేనేత నాయకులు తడక రమేష్, కొట్టం కరుణాకర్ రెడ్డి, తడక గౌరీశంకర్, గుండు ఉప్పలయ్య, మెరుగు శశికళ, పట్టణ కాంగ్రెస్ నాయకులు కీర్తి సంజీవ, ఎజాస్, కుక్క కుమార్, నల్ల నాగేష్, కుక్క స్వామి, బోగ నర్సింహ, మేకల రామకృష్ణ, సూరపల్లి రమేష్, సూరపల్లి రాము, రుద్ర చంద్రప్రకాష్, జింకల కుమార్, జయసూర్య తదితరులు పాల్గొన్నారు.


వలిగొండలో ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది

వలిగొండ: ప్రజాస్వామ్యంలో ఓటు విలువైందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు ఓటు ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయచ్చు అన్నారు. సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడానికి ఓటు దోహదపడుతుందని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కిష్టయ్య, నాయకులు కుంభం విద్యాసాగర్‌రెడ్డి, వెంకటపాపిరెడ్డి, బోళ్ల శ్రీనివాస్, చిలుగూరి సత్తిరెడ్డి, రవి, సురేందర్, సహదేవ్, సాయి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

ఆలేరు రూరల్, మే 13: జనగామ నుంచి హైదరాబాద్‌కు 60మంది ప్రయాణికులతో వెళుతున్న అదే డిపోకు చెందిన బస్సుకు సోమవారం ఆలేరులో పెను ప్రమాదం తప్పింది. జనగామ డిపోలకు చెందిన బస్సు ఆలేరు మీదుగా హైదరాబాద్ వెళుతున్న క్రమంలో స్థానిక భారత్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే ఒక్కసారిగా ద్విచక్ర వాహనం బస్సు వైపు దూసుకు వచ్చింది. ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే క్రమంలో బస్సు పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో బస్సును నడిపించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఒకవేళ బస్సు పెట్రోల్ బంక్‌కు తగిలి ఉండే పెను ప్రమాదం జరిగి ఉండేది.

కాంగ్రెస్‌లో చేరిక

మోత్కూరు, మే 13: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని రాజన్నగూడెంకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎల్దండె కిషన్‌రెడ్డి ఆదివారం రాత్రి కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పైళ్ల సోమిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు వారు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులవుతున్నారు

రామన్నపేట, మే 13: కాంగ్రెస్ చేపడుతున్న పథకాలకు పలువురు ప్రజలు ఆకర్షితులవుతున్నారని మాజీ జడ్పీటీసీ జినుకల వసంత ప్రభాకర్ అన్నారు. సోమవారం రామన్నపేటలో ఓటుహక్కు వినియోగించుకున్న అనంతరం మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.